సాక్షి
వైఎస్ఆర్ జిల్లా

శనివారం । 20 । సెప్టెంబర్ । 2025

I



వైద్య విద్యను ప్రైవేటీకరించడం ప్రమాదం

వైద్య రంగాన్ని ప్రైవేటుపరం చేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని డాక్టర్ నాగార్జునరెడ్డి అన్నారు. -IIలో



పకడ్బందీగా దసరా ఉత్సవాలు

దసరా ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహి స్తామని జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అన్నారు. ప్రొద్దుటూరు డీఎస్పీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. -IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.2/24.6

జిల్లాలో శుక్రవారం 24.6 – 33.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.4 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

కలెక్టర్‌ను కలిసిన ఎస్పీ



కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

కడప అర్బన్: జిల్లా కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్‌ను నూతన ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లాలో ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆయన తొలి సారిగా కలిశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఉత్సాహంగా రైఫిల్ షూటింగ్ పోటీలు



రైఫిల్ షూటింగ్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక జార్జ్‌కారొనేషన్ క్లబ్‌లో శుక్రవారం అండర్ –14, 17 జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ఐ రైఫిల్ షూటింగ్ పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లాలోని పలు ప్రాంతాలకు చెందిన 60 మంది క్రీడాకారులు పాల్గొని, తమ క్రీడా నైపుణ్యంతో ఆకట్టుకున్నారు. ఓపన్ సైట్, పీప్ సైట్, పిస్టల్ విభాగంలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. పోటీలను ఎస్జీఎఫ్ఐ సెక్రటరీలు శ్రీకాంత్‌రెడ్డి, చంద్రావతి, జార్జ్‌కారొనేషన్ క్లబ్ సెక్రటరీ సుధాకర్‌రెడ్డి, వైస్‌ప్రెసిడెంట్ బాలగంగిరెడ్డి, కో ఆర్డినేటర్‌లు ప్రవీణ్ కిరణ్, రాఘవేంద్ర, వ్యాయామ అధ్యాపకులు, ఉపాధ్యాయులు తదితరులు పర్యవేక్షించారు.

పశువైద్య కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభం



విద్యార్థిని అడ్మిషన్ చేసుకుంటున్న కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసప్రసాద్

ప్రొద్దుటూరు: మండలంలోని గోపవరం సమీపంలో ఉన్న శ్రీవెంకటేశ్వర పశువైద్య కళాశాలలో 2025–26 విద్యాసంవత్సరానికి బీవీఎస్సీ అండ్ ఏహెచ్ కోర్సులో శుక్రవారం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయి. ఏపీ ఎంసెట్ ద్వారా వెటర్నరీ విశ్వవిద్యాలయం నిర్వహించిన మొదటి కౌన్సెలింగ్‌లో ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థుల సర్టిఫికెట్లు తనిఖీ చేసి, కళాశాల అడ్మిషన్ బృందం వారిని అడ్మిట్ చేసుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాసప్రసాద్ మాట్లాడుతూ 19, 20, 21 తేదీలలో అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. మొదటి రోజు 22 మంది విద్యార్థులు కళాశాలలో అడ్మిషన్లు పొందారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఇందిర, డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ ఊర్మిళ, డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ శ్రావణి ప్రజ్ఞ తదితరులు పాల్గొన్నారు.

న్యూఢిల్లీ శిఖరాగ్ర సభకు ఉపాధ్యాయుడు



గాంధీనగర్ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు సురేష్

కడప ఎడ్యుకేషన్: న్యూఢిల్లీలో ఇటీవల ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన జీ20 శిఖరాగ్ర సభకు కడప గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన గణిత ఉపాధ్యాయుడు సురేష్ వెళ్లి పాల్గొన్నారు. న్యూఢిల్లీ భారత మండపంలో ఈ నెల 15 నుంచి 19 వరకు జరిగిన జీ20 శిఖరాగ్ర సమావేశంలో సుమారు 100 దేశాల ప్రతినిధులు పాల్గొన్నారు. 59వ ఇంటర్నేషనల్ ఎలక్ట్రో టెక్నికల్ కమిషన్ (ఐఈసీ) జనరల్ మీటింగ్, ఎక్స్‌పోలో పాల్గొనుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అకడమిక్ డెలిగేట్‌గా కడప గాంధీనగర్ మున్సిపల్ హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు బి.సురేష్‌కు బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్(బీఐఎ) ఏపీ విజయవాడ బ్రాంచ్ నుంచి ఆహ్వానం అందింది. ఈ మేరకు ఆయన ఐఈసీ– 2025 జనరల్ మీటింగ్‌కు వెళ్లి పాల్గొన్నారు. ప్రస్తుతం ఎలక్ట్రిక్, ఎలక్ట్రానిక్ రంగంలో సాధించిన సాంకేతిక అభివృద్ధి ముఖ్యంగా భారత్ ఈ రంగాల్లో సాధించిన ప్రగతిపై చర్చించేందుకు బీఐఎస్ సంస్థ ఈ అంతర్జాతీయ సమావేశం ఏర్పాటు చేసింది.

ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు, విద్యార్థులు



వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న యువకులు



కళాశాల ఎదుట ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ విద్యార్థుల ఆందోళన



కదం తొక్కిన విద్యార్థి లోకం

- 'చలో మెడికల్ కళాశాల' విజయవంతం
- ప్రైవేటీకరణపై వెల్లువెత్తిన నిరసన
- కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం
- పీపీపీ జీఓ వెనక్కి తీసుకోవాలని డిమాండ్
- ఎందాకైనా పోరాడుతామని హెచ్చరిక





పులివెందుల మెడికల్ కళాశాల వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు

పులివెందుల: విద్యార్థి లోకం కదం తొక్కింది. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణపై గర్జించింది. కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. పీపీపీ జీవో వెనక్కి తీసుకునే వరకు పోరాడుతామని హెచ్చరించింది. వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన 'చలో మెడికల్ కళాశాల' కార్యక్రమం విజయవంతమైంది. వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన, విద్యార్థి, సోషల్ మీడియా, వలంటీర్ విభాగాలు, అనుబంధ విభాగాలు నాయకులు నేతృత్వం వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి విద్యార్థులు పెద్ద ఎత్తున పులివెందులకు తరలి వచ్చారు. పులివెందుల మెడికల్ కళాశాలకు ఉదయాన్నే చేరుకున్నారు. కళాశాల ముఖ ద్వారం నుంచి ఆవరణమంతా కలియతిరుగుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అక్కడ ఉన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ విగ్రహం వద్ద నేలపైన కూర్చొని నిరసన కార్యక్రమం చేపట్టారు. మెడికల్ కళాశాల ప్రైవేటీకరణ ఆపాలి, కళ్లున్న కబోది చంద్రబాబు, ఉచిత విద్య, వైద్యం ప్రజల హక్కు అనే ప్లకార్డులను చేతబూని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. నినాదాలతో ఆ ప్రాంతం మార్మోగింది. అనంతరం వివిధ విభాగాల నాయకులు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో 17 మెడికల్ కాలేజీలకు రూ.8500 కోట్లు కేటాయించారని తెలిపారు. ఇప్పటికే ఐదు కాలేజీల నిర్మాణం పూర్తి చేసి, ప్రారంభించారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 15 నెలలవుతున్నా మిగతా కాలేజీల నిర్మాణానికి ఒక్క ఇటుక కూడా పేర్చకుండా పబ్బం గడుపుతోందన్నారు. పైగా ఆ కాలేజీలను ప్రైవేటు పరం చేయాలని కుట్ర పన్నుతోందన్నారు. దీన్ని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలన్నారు. కార్యక్రమంలో పులివెందుల మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు హాలు గంగాధరరెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, కౌన్సిలర్లతోపాటు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి ఆదిత్యరెడ్డి, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం ప్రధాన కార్యదర్శి షేక్ ఉమర్, వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు వివేక్, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సాయిదత్త, వైఎస్సార్‌సీపీ వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, గుంటి నాగేంద్ర, జశ్వంత్‌రెడ్డి, రామ్‌లక్ష్మణ్‌రెడ్డి, నీలం సాకవర్ధన్‌రెడ్డి, రహమతుల్లా ఖాన్, వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, జిల్లా నలుమూలల నుంచి విద్యార్థిని, విద్యార్థులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

17 మెడికల్ కళాశాలలు స్థాపన



వైఎస్ఆర్‌సీపీ పాలనలో 17 మెడికల్ కళాశాలలు స్థాపించారు. 5 కళాశాలల నిర్మాణాలు పూర్తి చేసి ప్రారంభించారు. వాటిలో 1500 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. మరో 5 కళాశాలలను అందుబాటులోకి తీసుకువచ్చే ప్రయత్నం చేశారు. అందుకు సంబంధించి పాడేరు, పులివెందుల మెడికల్ కళాశాల్లో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కూడా ఇచ్చారు.

– దేవసాని ఆదిత్యారెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ

చంద్రబాబు ఒక్క కళాశాల తీసుకురాలేదు



2017–19లో నరేంద్రమోదీ దేశం మొత్తంలో 92 మెడికల్ కళాశాలలు మంజూరు చేశారు. సీఎం చంద్రబాబు కూటమిలో ఉండి కూడా 2017లో ఒక్కటంటే ఒక్కటి కూడా మెడికల్ కళాశాలను మన రాష్ట్రానికి తీసుకరాలేదు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 17 కళాశాలలు తీసుకొచ్చారు. ప్రస్తుతం వీటిని ప్రైవేటీకరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్రలు పన్నుతోంది.

– దేవిరెడ్డి ఆదిత్య, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ

సీట్లు కేటాయిస్తే.. వెనక్కి పంపారు



పులివెందుల మెడికల్ కళాశాల, వైద్యశాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాదాపు పూర్తి చేసింది. నేషనల్ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వ్యవస్థ వచ్చి చూసి 50 సీట్లు కేటాయించింది. అయితే ఈ సీట్లు మాకొద్దని కూటమి ప్రభుత్వం వెనక్కి పంపింది. అంతేకాకుండా ఈ కళాశాలను ప్రైవేట్ పరం చేయడానికి టెండర్లకు ప్రకటన ఇచ్చింది.

– షేక్ ఉమర్, యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, వైఎస్సార్‌సీపీ

పీపీపీ అంటే ప్రైవేటుకు కట్టబెట్టడమే



మెడికల్ కాలేజీలను పీపీపీ(ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం)తో నిర్వహిస్తామని కూటమి ప్రభుత్వం చెబుతోంది. పీపీపీ పద్ధతిలో ఉన్నా ప్రభుత్వ ఆస్తే.. అయితే ప్రైవేట్ వ్యక్తులు నిర్వహిస్తారని చెప్పడం ప్రజలను మభ్య పెట్టడమే. నారాయణ, చైతన్య విద్యా సంస్థలకు దోచిపెట్టే కుట్రలో భాగమే ఇది. తక్షణమే పీపీపీ జీవోను రద్దు చేయాలి. లేనిపక్షంలో ఉద్యమం మరింత ఉధృతం చేస్తాం.

– వివేక్, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు

పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం



మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే.. పేద విద్యార్థులకు వైద్య విద్య దూరం అవుతుంది. కాలేజీలను అనుబంధంగా ఉన్న ఆస్పత్రులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లడంతో.. ఉచిత వైద్య సౌకర్యం పేదలు కోల్పోతారు. గుంటూరు, తిరుపతి, విజయవాడ, విశాఖపట్టణం ప్రాంతాల్లో ప్రభుత్వ కళాశాలలు ఉన్నాయని, అవన్నీ ప్రభుత్వం నిర్వహించేటప్పుడు వీటిని ఎందుకు నిర్వహించలేమన్నారు.

– సాయిదత్త, వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు

జగన్‌కు పేరు వస్తుందనే ఉద్దేశంతోనే..



సామాన్య ప్రజలకు విద్య, వైద్యం అందించాలన్న ఉద్దేశంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేశారు. వాటిని ప్రారంభిస్తే వైఎస్ జగన్‌కు మంచి పేరు వస్తుందన్న ఉద్దేశంతో ప్రైవేట్ పరం చేసేందుకు కుట్ర పన్నుతున్నారు. ప్రజలతో కలిసి అలుపెరగని పోరాటాలు చేసి ప్రైవేటీకరణను అడ్డుకుంటాం. ప్రజలు కూడా అన్నీ గమనిస్తున్నారు. త్వరలో కూటమికి బుద్ధి చెబుతారు.

– శ్రీకాంత్, వలంటీర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు

ఎంత వరకైనా పోరాడుతాం



వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.542 కోట్లు ఖర్చు పెట్టి పులివెందుల మెడికల్ కాలేజీ నిర్మించారు. ఇంకా రూ.120 కోట్లు ఖర్చు అయ్యే పనులను పూర్తి చేయకుండా కూటమి ప్రభుత్వం అమ్మకానికి సిద్ధంగా ఉంచింది. దీన్ని అడ్డుకునేందుకు ఎంత వరకైనా పోరాడుతాం. రాష్ట్రంలో ఉన్న ప్రతి దివ్యాంగుడు ఈ ఉద్యమానికి ముందుండి సహకరిస్తారు.

– దుర్గారావు, వికలాంగ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు

సీమపై వివక్ష.. ఉద్యమమే రక్ష

- రాయలసీమపై కూటమి శీతకన్ను
- సాగునీటి ప్రాజెక్టులకు గ్రహణం
- పరిశ్రమలు, వైద్య రంగంపై నిర్లక్ష్యం
- ఉద్యమ కార్యాచరణకు శ్రీకారం
- నేడు కోవెలకుంట్లలో నేతల సమావేశం



కడప సెవెన్‌రోడ్స్: రాయలసీమపై కూటమి ప్రభుత్వం వివక్ష ప్రదర్శిస్తోంది. తమ హక్కులు సాధించుకునేందుకు ఈ ప్రాంత వాసులకు పోరాటమే శరణ్యమని ఉద్యమ నేతలు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో రాయలసీమ సాగునీటి ప్రాజెక్టులు, అభివృద్ధి కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందించేందుకు శనివారం ఉదయం 10.00 గంటలకు కోవెలకుంట్లలోని పేరా ఫంక్షన్ హాలులో సమావేశం నిర్వహించనున్నారు. కుందూ పోరాట సమితి నాయకులు కామని వేణుగోపాల్‌రెడ్డి ప్రథమ వర్ధంతి సభ సందర్భంగా కుందూ పరిరక్షణ సమితి, కుందూ పోరాట సమితి, కోవెలకుంట్ల ప్రజా సంఘాల ఐక్యవేదిక సంయుక్తాధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉద్యమ నేత కరీంబాషా తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాయలసీమ ప్రాంత అభివృద్ధి పట్ల వివక్ష ప్రదర్శిస్తోంది. ముఖ్యంగా రాయలసీమ శాశ్వత కరువు నివారణకు ఉద్దేశించిన సాగునీటి ప్రాజెక్టులను విస్మరిస్తోంది. వీటి నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించకపోవడంతో భవిష్యత్తు అంధకారంగా మారింది. ఎటువంటి అభ్యంతరాలు లేకపోయినా, గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు మళ్లించి శ్రీశైలంలో.. ఆ మేరకు ఆదా అయిన నీటిని రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించే అంశాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ఏమాత్రం పట్టించుకున్న దాఖలాలు లేవనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరణ కోసం 2008లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి కోవెలకుంట్ల సమీపంలోని జొలదరాశి, పెద్దముడియం మండలంలోని రాజోలు రిజర్వాయర్లకు శంకుస్థాపన చేశారు. 17 ఏళ్లు గడిచినా ఇంతవరకు నిర్మాణం ఊసే లేదు. జమ్మలమడుగు నియోజకవర్గంలో భూ సేకరణ పేరుతో రైతుల భూములను ప్రభుత్వం సేకరించింది గానీ ఇప్పటి వరకు పరిహారం చెల్లించలేదు. దీంతో భూములను అమ్ముకోవడానికి కూడా తమకు హక్కు లేకుండా పోయిందని కుందూ పరీవాహక ప్రాంత గ్రామాల రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చేపట్టి గోదావరి జలాలను తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. ఆ దిశగా ఎత్తిపోతల పథక నిర్మాణ పనులు కూడా జరిగాయి. చంద్రబాబు అండ్ కో కుతంత్రాలతో ఆ పథకం అర్ధాంతరంగా ఆగింది. గాలేరు–నగరి వరద కాలువ సామర్థ్యాన్ని 30 వేల క్యూసెక్కులకు పెంపు చేసే పనులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. కర్నూలు జిల్లాలోని పెట్నికోట వద్ద 20 టీఎంసీలు, కడప జిల్లా ముద్దనూరు మండలం దేవేపల్లె వద్ద 20 టీఎంసీల సామర్థ్యంతో రిజర్వాయర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందువల్ల కృష్ణానది వరద సమయాల్లో వీలైన మేరకు నీటిని నిల్వ చేసుకునేందుకు అవకాశం ఉంటుంది. దేవేపల్లె రిజర్వాయర్ నుంచి చక్రాయపేట మండలంలోని కాలేటివాగుకు నీరు తీసుకు రావాలని భావించారు. కాలేటివాగు నిర్మాణ పనులు కూడా దాదాపు 80 శాతం వైఎస్సార్‌సీపీ సర్కారు హయాంలోనే జరిగాయి. అక్కడి నుంచి కృష్ణా జలాలు వెలిగల్లు రిజర్వాయర్‌కు తరలించి హంద్రీ–నీవాతో అనుసంధానం చేసి మదనపల్లె, పుంగనూరు ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలనేది ఆ పథక ఉద్దేశం. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పథకాన్ని నిర్వీర్యంగా మార్చారు. బనకచర్ల నుంచి గాలేరు–నగరి వరద నీటి కాలువ నిర్మాణ పనులు ఆగిపోయాయి. వైఎస్ఆర్ హయాంలో పూర్తయిన వామికొండ, సర్వరాయసాగర్, బ్రహ్మంసాగర్ ఆయకట్టు కింద సాగునీటిని అందించేందుకు డిస్ట్రిబ్యూటరీలు, ఫీల్డ్ ఛానల్స్ పనులు కూడా.. చేపట్టకపోవడంతో ప్రాజెక్టుల భవిష్యత్తు అయోమయంగా మారింది.

విద్య, వైద్య సౌకర్యాలు దూరం


ఇకపోతే కూటమి ప్రభుత్వ నిర్వాకం వల్ల పులివెందుల మెడికల్ కళాశాల 50 సీట్లు కోల్పోవాల్సి వచ్చింది. అధికారంలోకి వచ్చిన మొదటి ఏడాదిలోనే ఇలా వ్యవహరించిన ప్రభుత్వం ఇప్పుడు పీపీపీ పద్ధతిలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటు పరం చేసేందుకు ప్రయత్నిస్తోంది. ఇందువల్ల ముఖ్యంగా వెనుకబడ్డ రాయలసీమ ప్రాంత విద్యార్థులతోపాటు ప్రజలు విద్య, వైద్య సౌకర్యాలను కోల్పోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

అన్నీ అమరావతికి తరలింపు

విశాఖ–చెన్నై పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌ను అమరావతికి తరలించడం ద్వారా ఈ ప్రాంతానికి అన్యాయం చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో తీసుకొచ్చిన పరిశ్రమలను ఇటీవల మంత్రి లోకేష్ ప్రారంభించి.. అవి తానే ఏర్పాటు చేయించుకున్నట్లుగా చెప్పుకోవడం పట్ల ప్రజలు విస్తుపోతున్నారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని అమరావతికి తరలిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉద్యమం ద్వారా ఒత్తిడి తెస్తే తప్ప రాయలసీమకు న్యాయం జరగదన్న ఉద్దేశంతో భవిష్యత్తు కార్యాచరణ రూపొందించేందుకు శనివారం కోవెలకుంట్లలో నిర్వహిస్తున్న సమావేశానికి పాత, కొత్త తరానికి చెందిన ఉద్యమ నాయకులు తరలి రావాలని కరీంబాషా కోరారు.

కొనసాగుతున్న వర్షాలు

- మూడో రోజూ కురిసిన వాన
- అత్యధికంగా వేములలో 40 మి.మీ



కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. గురువారం రాత్రి, శుక్రవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వరుసగా నాలుగు రోజులుగా పడిన ఈ వర్షాలు ఆరుతడి పంటలకు ఒక రకంగా ముప్పే. ముఖ్యంగా ఉల్లి, జొన్న, మొక్కజొన్న, సజ్జ తదితర పంటలు, పూల తోటలపై ప్రభావం చూపిస్తాయి. ఇంతటితో తగ్గుముఖం పడితే అంతగా నష్టం కలగదని రైతులు పేర్కొంటున్నారు. ఇలాగే కొనసాగితే ఉల్లి పంట తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉంది. అలాగే జొన్న, మొక్కజొన్న, సజ్జ, పూల తోటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఉద్యాన పంటలైన మామిడి, సపోట, జామ, నిమ్మ, పెద్దనిమ్మ తదితరాలకు ఒక రకంగా మేలు జరగనుంది. మిగతా వ్యవసాయ, ఉద్యాన పంటలకు మాత్రం కొంతమేర ముప్పే.

మండలం కురిసిన వర్షం(మి.మీ)

వేముల	40	కడప	8.4
ఎర్రగుంట్ల	27.8	వల్లూరు	6.8
చెన్నూరు	22.4	ఖాజీపేట	6.4
వేంపల్లె	21.2	పులివెందుల	6.0
సింహాద్రిపురం	18.2	సీకేదిన్నె	5.4
తొండూరు	17.4	లింగాల	5.2
వీఎన్‌పల్లి	16.4	చక్రాయపేట	4.2
మైలవరం	13.4	కొండాపురం	2.2
ముద్దనూరు	12.8	జమ్మలమడుగు	2.2
కమలాపురం	11.2	చాపాడు	1.8

క్లుప్తంగా

నంది విగ్రహం చోరీ


చోరీకి గురైన నంది విగ్రహం

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లెలో వెలసిన పురాతన లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో నంది విగ్రహాన్ని దుండగులు గురువారం అర్ధరాత్రి చోరీ చేశారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. ఆలయంలోని వినాయకుడి విగ్రహం ఎదుట నంది విగ్రహం ఉంది. పురాతన ఆలయం కావడంతో గుప్తనిధుల కోసం నంది విగ్రహాన్ని చోరీ చేసి ఉంటారని గ్రామస్థులు అనుమానిస్తున్నారు. రూరల్ సీఐ చల్లనిదొర, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి పరిశీలించారు. ఆలయ ఈఓ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో లారీ బోల్తా



చింతకొమ్మదిన్నె : టమాట లోడ్‌తో వెళుతున్న లారీ గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో శుక్రవారం బోల్తాపడింది. రాయచోటి వైపు నుంచి కడప వైపునకు వస్తూ ఘాట్ మొదటి మలుపు వద్ద అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. లారీ రోడ్డుకు అడ్డుగా పడడంతో కొద్దిసేపు వాహనాలకు అంతరాయం కలిగింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకొని వివాహిత ఆత్మహత్య

రాయచోటి : పట్టణంలోని మాసాపేటలో సుగవాసి సుభద్రమ్మ(60) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. శుక్రవారం ఉదయం ఇంటిలో ఎవరూలేని సమయంలో వరండాలో కడ్డీకి చీరతో ఉరివేసుకున్నట్లు తెలిపారు. సుభద్రమ్మ భర్త మృతిచెందగా ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. గత కొద్దిరోజులుగా సుభద్రమ్మ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికుల సమాచారం. రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఆర్థికంగా ఇబ్బందులు నెలకొనడంతో ఈ పరిస్థితులు తలెత్తాయని పోలీసులకు అందిన సమాచారం. సమాచారం అందుకున్న రాయచోటి పోలీసులు సంఘటనపై కేసు నమోదు చేసి సుభద్రమ్మ మృతదేహాన్ని పంచనామా నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వైద్య విద్యను ప్రైవేటీకరించడం ప్రమాదం

కడప రూరల్ : వైద్య రంగాన్ని ప్రైవేటుపరం చేసి కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టాలని చూస్తే పేద విద్యార్థులకు వైద్య విద్య దూరమయ్యే ప్రమాదం ఉందని డాక్టర్ నాగార్జునరెడ్డి అన్నారు. స్థానిక ఐఎంఏ హాల్‌లో ప్రభుత్వ విద్య ప్రైవేటీకరణ..లాభ–నష్టాలు అంశంపై జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థల ద్వారా విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాలు, రోగులకు సేవలందించడం ద్వారా వైద్య రంగంలో మెలకువలు తెలుసుకునేందుకు పేద విద్యార్థులకు అవకాశం ఉంటుందన్నారు. ప్రభుత్వం అమలు చేసే పీపీపీ విదానాన్ని ఉత్తరాఖండ్, గోవా, కర్ణాటక, తమిళనాడు, కేరళలో వ్యతిరేకించారని తెలిపారు. రాష్ట్రంలో పది మెడికల్ కళాశాలలుండగా, ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించేందుకు నోటిఫికేషన్ విడుదల చేయడం తగదన్నారు. 66 ఏళ్లకు కోట్ల రూపాయల ఆస్తులను రూ.5వేలకు లీజుకు ఇవ్వడం శోచనీయమని తెలిపారు. డాక్టర్ నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ ప్రైవేటుపరం చేయడం ద్వారా సీట్లను అమ్ముకుని వైద్య విద్యను వ్యాపారం చేయడమేనని తెలిపారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ప్రైవేటీకరణ విధానాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు స్థాయిలో వ్యతిరేకిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శివారెడ్డి, డాక్టర్ పెంచలయ్య, డాక్టర్ సామేల్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నాగార్జునరెడ్డి

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ తగదు



పులివెందులలో అన్ని హంగులతో మెడికల్ కాలేజీ ఏర్పాటైంది. ఈ కాలేజీలు ప్రైవేటుపరం చేయాలనుకోవడం దారుణం. ప్రైవేటీకరణతో విద్యాబోధన సక్రమంగా ఉండదు. దీంతో విద్యార్థుల భవిష్యత్తు దెబ్బతినే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ ఎస్.గౌస్‌పీర్, కడప

ప్రభుత్వ నిర్ణయం మంచిది కాదు



ప్రభుత్వ నిర్ణయాలు ప్రజా ప్రయోజనకరంగా ఉండాలి. వైద్య విద్య కాలేజీల ప్రైవేటుపరం చేయడంతో సిబ్బందితోపాటు మౌలిక సదుపాయాలు ఉండవు. అలాగే అక్కడికి వచ్చే రోగుల ద్వారా నైపుణ్యాన్ని పెంచుకోవాల్సి ఉంటుంది. అక్కడ రోగుల సంఖ్య చాలా తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది.

– డాక్టర్ బాలిరెడ్డి, కడప

వైద్య విధానంలో రాజకీయం తగదు



రోగులకు సేవలందించే కీలకమైన వైద్య విధానంలో రాజకీయాలు తగవు. ఏవైనా నిర్ణయాలు తీసుకునేటపుడు వైద్యులు, ఇతర విద్యార్థులు, తదితర సంస్థలకు, ప్రజలకు ప్రయోజనకరంగా ఉండేలా పాలకులు చర్యలు తీసుకోవాలి.

– డాక్టర్ రామచంద్రయ్య, కడప

ప్రైవేటుపరం వెనుక అవినీతి ముసుగు



వైద్య విద్యను ప్రైవేటుపరం చేయడం ద్వారా అవినీతి ముసుగు ఉంది. వైద్యులతో పాటు కీలకమైన పారా మెడికల్ స్టాఫ్‌ను పెంచాలి. కడపలో కేన్సర్ ఆస్పత్రి ఉంటే ప్రభుత్వం ఇంతవరకు అక్కడ సిబ్బంది, సౌకర్యాలను కల్పించకపోవడం శోచనీయం.

– డాక్టర్ రాంగోపాల్‌వర్మ, కడప

తక్కువ బరువు ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

కడప కోటిరెడ్డి సర్కిల్ : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే తక్కువ బరువు ఉన్న చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ పీడీ పి.రమాదేవి, టాటా ట్రస్ట్ డాక్టర్ వీరభద్రుడు, అమరావతి, వరలక్ష్మి తెలిపారు. కడప నగరంలోని మానస ఇన్ హోటల్‌లో జిల్లా స్థాయి సీడీపీఓ, సూపర్‌వైజర్లకు కమ్యూనిటీ బేస్డ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ అక్యూట్‌మాల్ న్యూట్రిషియన్స్‌పై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. వారు మాట్లాడుతూ 0–5 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహార లోపం ఉన్న వారిని గుర్తించి ఆరోగ్య చికిత్స అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు ఎత్తు, బరువు తీసి తీవ్ర లోప పోషణ, అతి తీవ్ర లోప పోషణ పిల్లలను గుర్తించాలన్నారు. వారికి అదనంగా బాలామృతం 2.5 కేజీలు ఇవ్వాలన్నారు. తల్లులకు బిడ్డ స్థితి గురించి తెలియజేసి పర్యవేక్షించాలన్నారు. అనంతరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బద్వేలు, చాపాడు, జమ్మలమడుగు, కడప, కమలాపురం, ముద్దనూరు ప్రాజెక్టుల సీడీపీఓలు, సూపర్‌వైజర్లు హాజరయ్యారు.

కస్తూర్బాగాంధీ విద్యాలయం తనిఖీ


యాప్ వినియోగంపై సూచనలిస్తున్న నిత్యానందరాజు

వల్లూరు : వల్లూరులోని కస్తూర్బా గాంధీ విద్యాలయాన్ని సమగ్ర శిక్ష జిల్లా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నిత్యానందరాజు శుక్రవారం తనిఖీ చేశారు. ఉదయం ప్రార్థనా సమయానికి విద్యాలయానికి చేరుకున్న ఆయన ప్రార్థన అనంతరం మెనూ పరిశీలించారు. సరకుల నిల్వలు, స్టాకు నమోదు, రోజువారీ వినియోగం అంశాలను పరిశీలించారు. జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా అమలవుతున్న హాస్టల్ నిర్వహణపై ప్రిన్సిపల్, అకౌంటెంట్‌కు సూచనలు చేశారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆదేశించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని జీసీడీవో రూత ఆరోగ్యమేరీ అన్నారు. అనంతరం హాస్టల్ మానిటర్ యాప్ టీమ్ సభ్యులు శివనాగేంద్రప్రసాద్ యాప్ వినియోగంపై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ నసీమున్నీసా, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలకు కొండారెడ్డి ఎలా హాజరవుతారు?

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


బ్యాడ్ మెమోరీస్ పుస్తకాన్ని చూపుతున్న మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా నంద్యాల వరదరాజులరెడ్డి ఉన్నారా.. లేక ఆయన కుమారుడు కొండారెడ్డి అనధికారిక ఎమ్మెల్యేగా ఉన్నారా అంటూ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివప్రసాదరెడ్డి ఎద్దేవా చేశారు. తన స్వగృహంలో విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ కొండారెడ్డిని ప్రజలు ఓట్లేసి ప్రజలు గెలిపించారా అని ప్రశ్నించారు. అధికార పూర్వకంగా వరదరాజులరెడ్డి ఎమ్మెల్యేగా ఉండాల్సి ఉండగా, రాజ్యాంగానికి విఘాతం కలిగిస్తూ వరద కుమారుడు కొండారెడ్డి కార్యక్రమాలు నిర్వహించడం చూసి ప్రజలు అసహ్యించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలకు వెళ్లడం, రిబ్బన్ కట్ చేయడం, రికార్డులను పరిశీలించడం ఏమిటంటూ ఆయన ప్రశ్నించారు. ఎన్నికల తర్వాత తాను హైదరాబాద్‌కు వెళ్లి వ్యాపారం చేసుకుంటానని చెప్పిన కొండారెడ్డి ఇపుడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. కొండారెడ్డిపై దేశ ద్రోహం కింద కేసు నమోదు చేసి జైలుకు పంపాలన్నారు. ప్రజలకు సేవ చేయాల్సిన వరదరాజులరెడ్డి దూరంగా ఉన్నారని, ఆయన కుమారుడు కొండారెడ్డి ప్రతి ప్రభుత్వ కార్యక్రమానికి హాజరవుతున్నారని ఆరోపించారు. ప్రజా సామ్యాన్ని అపహాస్యం చేస్తున్న అధికారులను గుర్తుపెట్టుకునేందుకు తాను బ్యాడ్ మెమోరీస్ రాస్తున్నానని తెలిపారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అలాంటి అధికారులను వదిలిబెట్టబోనన్నారు. ప్రభుత్వ ఆస్పత్రిలో సూపరింటెండెంట్ రూపాందన్ ఆహ్వానం మేరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమానికి హాజరైన కొండారెడ్డి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారన్నారు. ఈ విషయంపై నేషనల్ హెల్త్ మిషన్ ప్రాజెక్టు జాయింట్ సెక్రటరీ కిరణ్‌గోపాల్ వాస్కోకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. తాత్కాలిక కూరగాయల మార్కెట్ సందర్శించడం... కమిషనర్‌తోపాటు అధికారులంతా వెళ్లడం చూస్తే ఆందోళన కలిగిస్తోందన్నారు. ప్రజా ప్రతినిధి కానీ కొండారెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎలా పంపిణీ చేశారన్నారు. పోలీసు అధికారులు సైతం కొండారెడ్డికి సెల్యూట్ చేసి పుష్పగుచ్ఛాలు ఇచ్చినట్లు ఆధారాలు ఉన్నాయని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు లేనిపోని ఆరోపణలు చేసిన ఉక్కు ప్రవీణ్ ఇప్పుడు ఏమి చేస్తున్నారని రాచమల్లు ప్రశ్నించారు. వరదరాజులరెడ్డితో పాటు కొండారెడ్డి, రాఘవరెడ్డి, హరినాథరెడ్డి, భార్గవరెడ్డి దోచుకో.. దాచుకో అన్నట్లుగా తయారయ్యారన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్, మార్తల ఓబుళరెడ్డి, జంగమయ్య, రాగుల శాంతి, లావణ్య, సత్యం, అనిల్, భూమిరెడ్డి వంశీధర్ రెడ్డి, ముదిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, గరిశపాటి లక్ష్మీదేవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

21న పుష్పగిరిలో ఉచిత సామూహిక పిండ ప్రదానం

వల్లూరు : పుష్పగిరిలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం సమీపంలో పవిత్ర పెన్నానది ఒడ్డున గల రుద్ర పాద ఆలయం వద్ద పితృదేవతలకు ఉచిత సామూహిక పిండ ప్రదానం నిర్వహించనున్నట్లు ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు తెలిపారు. అత్యంత ప్రీతికరమైన మహాలయ అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని పుష్పగిరి లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకే కార్యక్రమం మొదలవుతుందని, మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని తెలిపారు. కుల మతాలతో సంబంధం లేకుండా ఎవరైనా తమ పితృదేవతలతో బాటు పరమపదించిన వారెవరికైనా పిండ ప్రదానం చేయవచ్చునని తెలిపారు. దేవస్థానం తరుపున పిండ ప్రధానానికి కావాల్సిన పసుపు, కుంకుమ, తమలపాకులు, వక్కలు, పూలు, అగరుబత్తీలు, కర్పూరము, ఇస్తర్లు, బియ్యంపిండి, నువ్వులు, దర్భ పవిత్రములు, తదితర సామగ్రి ఉచితంగా అందజేస్తారన్నారు. భక్తులు తమతో బాటు పంచ, టవలు, చెంబు, గ్లాసులు, ఉద్ధరేణి లేదా స్పూను, అర్ఘ్య పాత్ర లేక తట్ట తీసుకురావాల్సి వుంటుందని తెలిపారు. వాటితోబాటు ఉన్నవారు యజ్ఞోపవీతం తీసుకుని రావాల్సి వుంటుందని, అవకాశం వున్న వారు తేనె, ఆవు పాలు, బెల్లం, పూలు, పండ్లు తమ శక్తికొలదీ తీసుకుని రావచ్చునని తెలిపారు.

నాలుగు ఆర్‌ఎంపీ క్లినిక్‌లు సీజ్


క్లినిక్‌ను సీజ్ చేస్తున్న డాక్టర్ వి.మల్లేష్

దువ్వూరు : నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న నాలుగు ఆర్‌ఎంపీ క్లినిక్‌లను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.మల్లేష్ శుక్రవారం సీజ్ చేశారు. డాక్టర్ వి.మల్లేష్ మాట్లాడుతూ ఆకస్మిక తనిఖీల్లో పరిమితికి మించి రోగులకు చికిత్స అందిస్తున్నట్లు తేలిందని, యాంటిబయోటిక్స్, సెలైన్ బాటిల్స్‌తోతమ పరిధికి మించి వైద్య సేవలు అందిస్తున్నారని తెలిపారు. అర్హతలు, అనుమతులు లేకుండా ఇలాంటి వైద్యం చేయడం రోగుల ఆరోగ్యానికి ప్రమాదకరమన్నారు. ఆర్‌ఎంపీలు డాక్టర్ అనే పదమే వాడకూడదని, కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే రోగులకు అందించాలని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా దువ్వూరులో కొన్ని ఆస్పత్రుల పేరుతో రోగులకు మంచాలు, ఆక్సిజన్, అనుమతి లేని హెవీ యాంటి బయోటిక్స్ మందులను వాడుతూ మల్టీ స్పెషాలిటీ స్థాయిలో క్లినిక్ నిర్వహిస్తున్నారన్నారు. మండలంలో ఎక్కడైనా ఆర్‌ఎంపీలు నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు పెట్టి రోగులకు వైద్యం చేస్తే కఠిన చర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ సురేష్‌బాబు, హెల్త్ సూపర్‌వైజర్లు రాజగోపాల్, శివగంగరాజు, వెంకటేశ్వర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎఫ్‌పీ షాపు ఆథరైజేషన్‌పై హైకోర్టు స్పందన

కడప సెవెన్‌రోడ్స్ : సింహాద్రిపురం మండలం రావులకొలను గ్రామ ఎఫ్‌పీ షాపు డీలర్ హరిత ఆథరైజేషన్ రద్దుపై రాష్ట్ర హైకోర్టు వివరణ కోరింది. పులివెందుల ఆర్డీఓ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఎఫ్‌పీ షాపు డీలర్ హైకోర్టును ఆశ్రయించడంతో.. ఆ విధంగా కోర్టు స్పందించింది. డీలర్‌కు నాలుగు షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సిన అవసరం ఏమొచ్చిందో, ఇందుకు సంబంధించిన రికార్డులన్నింటినీ తీసుకుని శుక్రవారం తమ ఎదుట హాజరు కావాలని ఆర్డీఓను ఆదేశించింది.

హామీలను గాలికొదిలేసిన కూటమి ప్రభుత్వం


సమావేశంలో మాట్లాడుతున్న కెఎస్ఎస్.ప్రసాద్

బద్వేలు అర్బన్ : ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం గాలికొదిలేసిందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ అన్నారు. యూటీఎఫ్ రణభేరి రాష్ట్రవ్యాప్త ప్రచార జాత శుక్రవారం బద్వేల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక భాకరాపేట నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా జెడ్పీ హైస్కూల్ వరకు సీఐటీయూ, డీవైఎఫ్ఐ, ఐద్వా సంఘాల నాయకులతో కలిసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రసాద్ మాట్లాడుతూ ఉద్యోగుల అండదండలతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా పాలన సాగిస్తోందన్నారు. విలీనం పేరుతో వేలాది పాఠశాలలను మూసివేసి, ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మార్చివేసిందని అన్నారు. ఎన్నికలకు ముందు ఉద్యోగ, ఉపాధ్యాయులకు పక్షపాతిగా ఉంటామని, ఉద్యోగులకు మెరుగైన వేతనాలు అమలు చేస్తామని హామీలు గుప్పించి 15 నెలల కాలంలో వారిని పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఈ నెల 25వ తేదీన చలో విజయవాడ, భారీ బహిరంగ సభ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు కె.సురేష్‌కుమార్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదనవిజయకుమార్, పాలెంమహేష్ బాబు, శ్రీనివాసులు, చిన్ని, నాగార్జునరెడ్డి, సుజాత రాణి, సివి.రమణ, శివప్రసాద్, ఎజాస్‌అహ్మద్, రవీంద్రుడు, మురళీకృష్ణ, సుబ్బారావు పాల్గొన్నారు.

విద్యార్థులకు రాజ్యాంగంపై అవగాహన అవసరం

వైవీయూ వైస్ ఛాన్సలర్ అల్లం శ్రీనివాసరావు


మాట్లాడుతున్న వీసీ అల్లంశ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్ : ప్రతి విద్యార్థి రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్లం శ్రీనివాసరావు అన్నారు. వైవీయూలోని న్యూ అడ్మినిస్ట్రేషన్ భవనంలోని అన్నమాచార్య సెనేట్ హాల్లో 75 సంవత్సరాల భారత రాజ్యాంగంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఆచార్య శ్రీనివాసరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగం పౌరులకు ఎలాంటి రక్షణ కల్పిస్తుందో ఇప్పటికీ చాలామందికి తెలియకపోవడం బాధాకరమన్నారు. సాంకేతిక పదజాలాన్ని సమకూర్చి సదస్సుల ద్వారా చైతన్యం చేస్తున్న కమిషన్ ఫర్ సైంటిఫిక్ అండ్ టెక్నికల్ టెర్మినాలజీ(సి.ఎస్.టి.టీ) సిబ్బందిని ఆయన అభినందించారు. ప్రొఫెసర్ నవేద్ జమాల్ విద్యార్థుల ముంగిటకు విస్తృతంగా భారత రాజ్యాంగాన్ని తీసుకు వెళ్లాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. సిఎస్‌టీటీ ఏడీలు జెఎస్.రావత్, షాజాద్ అహ్మద్‌అన్సారీ మాట్లాడుతూ అంశాలు సమాచారయుతంగా, ప్రేరణాత్మకంగా ఉన్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ డాక్టర్ డి.రవీంద్రసతీష్‌బాబు, ప్రొఫెసర్ ఏజీ దాము, ప్రొఫెసర్ వై.సుబ్బరాయుడు, డాక్టర్ కె.సీతామాలక్ష్మి, డాక్టర్ వీఎం.రాజశేఖర్ వివిధ అంశాలపై ఉపన్యాసం చేశారు. ఈ సదస్సులో పాల్గొన్న పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులకు వీసీ ఆచార్య శ్రీనివాసరావు, అతిథులు సర్టిఫికెట్లను అందజేశారు.

దసరా ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తాం

– జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్


అధికారులతో మాట్లాడుతున్న ఎస్పీ

ప్రొద్దుటూరు క్రైం : దసరా ఉత్సవాలను పకడ్బందీగా నిర్వహిస్తామని జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ అన్నారు. ప్రొద్దుటూరు డీఎస్పీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. డీఎస్పీ భావనతో కలిసి సబ్‌డివిజన్‌లోని సీఐలు, ఎస్ఐలతో సమావేశమై స్టేషన్ల వారీగా పరిస్థితులు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో ఎస్పీ మాట్లాడుతూ ప్రొద్దుటూరులో క్రికెట్ బెట్టింగ్, మట్కాలను రూపుమాపుతామని, అసాంఘిక కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదన్నారు. మహిళల రక్షణకు అన్ని రకాల చర్యలు తీసుకుంటామన్నారు. విజయవాడ తర్వాత ప్రొద్దుటూరులో అత్యంత వైభవంగా దసరా ఉత్సవాలు నిర్వహిస్తారని, లక్షలాది భక్తులు వస్తున్నందున భద్రతాపరమైన చర్యల గురించి డీఎస్పీ, సీఐలకు ఆదేశాలు జారీ చేశామన్నారు. ఆలయకమిటీ నిర్వాహకులు, రెవెన్యూ, ఫైర్, విద్యుత్ తదితర శాఖలను సమన్వయం చేసుకొని ప్రశాంతంగా నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎస్పీ స్థానిక వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయాన్ని దర్శించుకున్నారు. దసరా ఉత్సవకమిటీ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌రావు దసరా ఉత్సవాల తీరును ఎస్పీకి వివరించారు. ఎస్పీ వెంట డీఎస్పీ భావన, సీఐలు తిమ్మారెడ్డి, సదాశివయ్య, వేణుగోపాల్, నాగభూషణం, రాజగోపాల్, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో అక్రమాలను నిరోధించాలి


మాట్లాడుతున్న విజయజ్యోతి

బద్వేలు అర్బన్ : దేశ వ్యాప్తంగా ఓటరు జాబితాలో జరిగే అక్రమాలను నిరోధించాలని, రాజ్యాంగాన్ని కాపాడేందుకు నిర్వహిస్తున్న ఓట్ చోర్ – గద్దీ చోడ్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షురాలు ఎన్‌డీ.విజయజ్యోతి కోరారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా లక్ష సంతకాలను సేకరిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందని, ప్రజలంతా చైతన్యవంతులు కావాలని కోరారు. ఈ సమావేశంలో అచ్యుతరాజు, చిన్నరామిరెడ్డి, నరసింహ, సుధాకర్‌రెడ్డి, పుల్లూరు బాషా, ఖాజావలి, సాంబయ్య, గురప్ప, బాలసుబ్బయ్య, శేఖర్‌రెడ్డి, నాయబ్‌రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ పీజీ ఫలితాలు విడుదల


పీజీ ఫలితాలు విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

కడప ఎడ్యుకేషన్ : యోగి వేమన విశ్వవిద్యాలయం ఎమ్మెస్సీ, ఎంఏ రెండో సెమిస్టర్, లేటరల్ ఎంట్రీ థర్డ్ సెమిస్టర్, ఫైన్ ఆర్ట్స్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ డిప్లమా కోర్సుల పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన తన చాంబర్‌లో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి.శ్రీనివాస్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ప్రొఫెసర్ కేఎస్వీ కృష్ణారావుతో కలిసి పీజీ ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఎంఏ, ఎంఎస్సీ కోర్సుల్లో ఎక్కువ బ్రాంచ్ లు వంద శాతం ఫలితాలు సొంతం చేసుకున్నాయన్నారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు.

ఉల్లి మార్కెటింగ్‌పై ప్రత్యేక దృష్టి

– కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలో పండించిన ఉల్లి పంటను రైతులకు నష్టం వాటిల్లకుండా మార్కెటింగ్ చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం అవసరమైన చర్యలు చేపట్టడం జరుగుతోందని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో కలెక్టర్ జేసీ అదితి సింగ్‌తో కలిసి ప్రభుత్వం చేపడుతున్న ఉల్లి పంట కొనుగోలుకు సంబంధించి జిల్లాలోని ఉల్లి ట్రేడర్లతో సమావేశం ఏర్పాటు చేసి, ప్రస్తుత రైతుల పరిస్థితి దృష్ట్యా ఉల్లి కొనుగోలుపై వారికి సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నష్టాల్లో ఉన్న రైతుల నుంచి అధిక లాభాలను ఆశించ రాదని జిల్లాలోని ఉల్లి ట్రేడర్లకు సూచించారు. రైతులు, వ్యాపారస్తులు.. ప్రభుత్వంతో సమన్వయంగా మార్కెటింగ్ చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఉల్లి నిల్వకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ప్రతిపాదనలు అందించాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లాలో రైతులు పండించిన ఉల్లి పంటను మార్కెటింగ్ చేయడంలో ఎదురవుతున్న సవాళ్లను అధిగమించేందుకు ఎలాంటి చర్యలను అవలంబిస్తే అనుకూలంగా ఉంటుంది? అనే అంశంపై చర్చించడం జరిగింది. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేసేందుకు జిల్లా యంత్రాంగం ప్రణాళిక ప్రకారం చర్యలు చేపడుతోందని వివరించారు. జిల్లాలోని చాలా ప్రాంతాల్లో ఇంకా ఉల్లి పంట కోతకు సిద్ధంగా ఉందని, ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో పంట దిగుబడిని ఎలా సంరక్షించుకోవాలి? ఒక్కసారిగా అధిక పంట యార్డులకు చేరితే దాన్ని ఎలా మార్కెటింగ్ చేయాలి? అనే అంశాలను రైతులు, ట్రేడర్లతో చర్చించి.. ఉల్లి రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, నాణ్యతను పరిగణనలోకి తీసుకుని ఈ కొనుగోలు ప్రక్రియను ప్రణాళికాబద్ధంగా, పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి రవిచంద్ర బాబు, జిల్లా మార్క్‌ఫెడ్ అధికారి పరిమళ జ్యోతి, మార్కెటింగ్ ఏడీ ఆజాద్ వలి తదితరులు పాల్గొన్నారు.